పోటీకి మన రాష్ట్రం నుండి ఎన్నికయింది మయూరి. తన జీవితానికే వన్నె తెచ్చే అవకాశమిది. తండ్రితో కలసి ఢిల్లీకి బయలుదేరింది.

తండ్రికి గుడ్‌నైట్ చెప్పి పడుకుంది మయూరి.

రాత్రి రెండుగంటల సమయం. ఉలిక్కిపడి లేచాడు దివాకర్. వణుకుతూ మూలుగుతోంది మయూరి.

"వాతావరణం మారినందువల్ల జ్వరం వచ్చింది. భయపడవలసింది ఏమీలేదు. ఉదయానికంతా మామూలుగా వుంటుంది" అంటూ మందులిచ్చి వెళ్లాడు డాక్టర్.

జ్వరం తగ్గిపోయింది. కానీ నీరసంగా వుంది. ఈ స్థితిలో నాట్యం చేయడం అసాధ్యం.

తాను కట్టుకున్న ఆశాసౌధం తన కళ్లముందే కూలిపోతుంటే తట్టుకోలేకపోయింది మయూరి. తండ్రిని పట్టుకుని భోరున ఏడ్చింది. తాను నమ్మిన దైవాన్ని కసిదీరా తిట్టుకుంది.

"కారణం లేకుండా ఏదీ జరగదు మయూరి. అయినా ఇప్పుడేమయిందని? నీ ఆరోగ్యం కుదుటపడనీ. ఈ అవకాశం తప్పిపోయినా మరో ఛాన్సు రాకపోదు. ఏ నాటికైనా నీ కోరిక నెరవేరుతుంది. అయితే కాస్త ఆలస్యం కావచ్చు. అంతే" కూతురికి ధైర్యం చెప్పాడు దివాకర్.

టీవీలో వార్తలు వింటూ మగతగా కళ్ళు మూసుకుంది మయూరి.

"ఇప్పుడే అందిన వార్త. ఈ రోజు నగరంలో జాతీయ నాట్య ప్రదర్శన జరుగుతున్న స్టేడియంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌వల్ల స్టేడియం మొత్తం అగ్నికి ఆహుతి అయింది. ప్రాణనష్టం ఎక్కువగానే వుంటుందని, అందులో ఎక్కువగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన నర్తకీమణులే ఉంటారని అంచనా. పూర్తి వివరాలు అందవలసి వుంది"

తండ్రీ కూతుళ్లిద్దరూ నిశ్చేష్టులయ్యారు.

"ఎంతో ఆరోగ్యంగా వున్న నీకు జ్వరం రావడమేమిటా అని నేను కూడా దైవాన్ని నిందించాను. రాబోయే ప్రమాదాన్ని దేవుడు ఎలా తప్పించాడో చూసాక దైవలీలలు ఎంతో విచిత్రంగా వుంటాయనిపిస్తోంది కదూ" అన్నాడు దివాకర్.

'నీ మహిమలు తెలియక తిట్టిన నా తప్పును మన్నించు స్వామీ' మనస్సులోనే దేవునికి ప్రణతులర్పించింది మయూరి.

**- టి.రామాంజనేయులు (హాలహర్వి)**

# వజ్రాయుధం

**"సుశీ! రేపు సెలవు పెట్టగలవా? సరదాగా షాపింగ్‌కి వెళదాం" అడిగాడు శ్రీరామ్ భార్య సుశీలని.**

"ఓ తప్పకుండా" అంది సుశీల.

"మీ బాస్ నీకు సెలవిస్తాడంటావా?" అన్నాడు శ్రీరామ్.

"అడిగేవిధంగా అడిగితే అతనే ఇస్తాడు" అని ధీమాగా జవాబిచ్చింది సుశీల.

* * *

టైం తొమ్మిదైంది. ఆఫీసుకి ఒకరొకరూ వస్తున్నారు. అరగంట ముందునుండి బాస్ కోసం టెన్షన్ పడుతూ వెయిట్ చేస్తున్నాడు పరమేశం. పదయ్యేసరికి బాస్ వచ్చారు. బెదురుబెదురుగా ఛాంబర్‌లో అడుగుపెట్టి విష్ చేశాడు పరమేశం.

"ఏమిటోయ్ పొద్దున్నే ఢీలాపడ్డ మొహంతో తగలడ్డావ్" చిరాగ్గా అడిగాడు బాస్ పరమేశాన్ని.

అతనిలోని వినుగుని గమనించిన పరమేశానికి నిరాశ అనిపించింది. అయినా ఓ ప్రయత్నంగా "సార్ మా మదర్‌కి సీరియస్‌గా ఉందని..." అభ్యర్థన పూర్తవకముందే అందుకున్నాడు బాసు.

"మదర్‌కి సీరియస్. ఫాదర్‌కి సెరాక్సిస్. అంటూ ఏవేవో సాకులు చెప్పి సెలవులు అడగడం అలవాటైపోయిందయ్యా మీకు. సెలవూ లేదు గిలవూ లేదు పో. పోయి నీ పనిచూసుకో" బాస్ కయ్ మన్నాడు.

"నిజంగానే సార్. ఇప్పుడే కబురొచ్చింది. హాస్పిటలలో జాయిన్ చెయ్యాలి" చిత్తరువులు చూస్తూ చెప్పాడు పరమేశం. "ఆ ఎవరో ఒకరు జాయిన్ చేస్తార్లే. సాయంత్రం మూడుగంటలకు పర్మిషన్ ఇస్తాను వెళ్ళు"

"ఎవరూ లేరు సార్. నేనే..."

"ఆ నువ్వే వెళ్ళాలి అంటావ్. నువ్వే వెళ్లొద్దు అంటాన్నేను. రేపు ఇన్స్పెక్షన్ ఉంది. ఫైల్స్, రికార్డులు అప్‌టు డేట్‌గా ఉండాలి. పెండింగ్ ఏమైనా ఉన్నాయేమో చూసి పూర్తిచెయ్. మరెక్కడ నిలబడకు వెళ్ళు" అరిచాడు బాసు.



చేసేదిలేక బయటపడ్డాడు పరమేశం.

ఏ ఫైల్ తీసినా తన తల్లి రూపమే కనిపిస్తోందతనికి. తల్లిని చూడాలన్న ఆరాటానికి అడ్డుకట్ట వేసి అన్యమనస్కంగా పనిచేసుకుపోతున్నాడు పరమేశం. సహోద్యోగుల ఓదార్పు కొంత బలాన్నివ్వడంతో దుఃఖాన్ని దిగమ్రింగి పెండింగ్ ఫైల్స్ పూర్తిచేసి నాలుగున్నరకు తల్లిని చూడటానికి వెళ్లగలిగాడు.

* * *

టైం సరిగ్గా అయిదయింది. ఒక్కొక్కరూ ఆఫీసు విడిచి ఇంటి ముఖం పడుతున్నారు. బాస్ ఛాంబర్‌లో అడుగుపెట్టింది సుశీల.

"గుడ్‌ఈవెనింగ్ సార్" అంది.

"ఆ ఏంటి" తలెత్తకుండానే అన్నాడు బాస్.

"రేపు సెలవు కావాలి సార్" అడిగింది సుశీల.

"నో...నో... రేపు సెలవు ఇవ్వడం కుదరదు. ఇన్స్పెక్షన్ ఉంది"

"చాలా అర్జంట్ పనిసార్" అంది సుశీల.

"అందరికీ అర్జంటే. అన్నీ అర్జెంట్లే. ఆఫీసు పని ఇంకా అర్జెంట్. రేపు మీరు వచ్చి తీరాలి" బాస్ చిరాగ్గా అరిచాడు.

ఓ అరనిముషం పాటు రూమ్‌లో నిశ్శబ్దం. సుశీల నిశ్శబ్దంగా బద్దలుకొట్టింది. బాస్ తలెత్తి చూసేలా చిన్న శబ్దంతో ముక్కు ఎగబీరుస్తోంది. ఆ శబ్దం బాస్‌లో చైతన్యానికి నాంది పలికింది. తలెత్తి ఆమె వైపు చూశాడు. వస్తున్న నీళ్ళధార బాస్ రాతి గుండెని కరిగించింది.

చిన్న నవ్వు నవ్వుకుంటూ కళ్ళు తుడుచుకుంటూ బయటికొచ్చింది సుశీల విజయోత్సాహంతో.

**- కె.వి.సన్యాసిరావ్ (అలమండ)**